సాక్షి
వైఎస్సార్ జిల్లా
గురువారం । 6 । జూలై । 2023



శ్రీనివాసులరెడ్డి హత్య కేసులో పురోగతి!

శ్రీనివాసులరెడ్డి హత్య కేసులో నిందితుడుగా భావిస్తున్న రాజు వెంకటసుబ్బారెడ్డిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. -8లో



జాతీయ విద్యావిధానంతో విప్లవాత్మక మార్పులు

పాఠశాల విద్య నుంచి ఉన్నతవిద్య వరకు మార్పులకు జాతీయ విద్యావిధానం తోడ్పడుతుందని వైవీయూ వీసీ అన్నారు. -8లో



రూ.3 లక్షలు విలువ చేసే ఎరువుల అమ్మకాలు నిలిపివేత

సరైన పత్రాలు లేకపోవడంతో రూ.3 లక్షలు విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలిపివేసినట్లు కడప డీడీఏఎఫ్‌టీసీ తెలిపారు. -8లో

న్యూస్‌రీల్

ఐటీఐలో షార్ట్ టర్మ్ కోర్సులు

కడప ఎడ్యుకేషన్‌: కడపలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజనా స్కీమ్(పీఎంకేవీవై) కింద 45 రోజులు, 90 రోజుల కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ రత్నరాజు తెలిపారు. వివరాలకు 9000366621, 9505965504 నంబర్లలో సంప్రదించాలన్నారు. కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలను కల్పిస్తామన్నారు.

9న జిల్లాస్థాయి చదరంగం పోటీలు

కడప స్పోర్ట్స్‌: కడప నగరం మస్తాన్‌వలి వీధిలోని చదరంగం హాల్‌లో ఈనెల 9వ తేదీ ఆదివారం ఉదయం జిల్లాస్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి.అనీస్‌దర్బారీ తెలిపారు. 18వ అష్రఫ్‌–ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీలో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 8341255151 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

7న మెగా రక్తదాన శిబిరం

ఏఎఫ్‌యూ : కడపలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 7వ తేదీన మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు వీసీ ఆచార్య బి.అంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మహానేత వైఎస్సార్ జయంతి నేపథ్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్గో ఏజెంట్ల కమీషన్ పెంపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కార్గో ఏజెంట్లకు కమీషన్ పెంచారు. జిల్లాలోని ఆరు డిపోల ద్వారా నెలకు రూ.70–85 లక్షల వరకు రాబడి వస్తోంది. ఆర్టీసీ డిపోలతో పాటు 50 కార్గో సెంటర్ల నుంచి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. గతంలో కమీషన్ ఐదు శాతం ఉండగా, తాజాగా 15 శాతానికి పెంచారు. కార్గో ఏజెంట్లుగా పనిచేసేందుకు ఆసక్తిగల వారు ఆయా డిపో మేనేజర్లను సంప్రదించాల్సి ఉంటుంది.

రిజిస్ట్రేషన్లకు సర్వర్ సమస్య

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో మంగళ, బుధవారాల్లో రిజిస్ట్రేషన్ల శాఖ సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్లు స్తంభించాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇంటర్నెట్ అందుబాటులో లేకపోవడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు బోసిపోయాయి. ఆ తర్వాత సర్వర్ కనెక్ట్ కావడంతో కొన్ని రిజిస్ట్రేషన్లు జరిగాయి.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో హెవీ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. త్వరలో 16వ బ్యాచ్ ప్రారంభం కానుందని, ఆసక్తి గలవారు అడ్మిషన్ల కోసం డ్రైవింగ్ శిక్షకులు జబ్బార్‌ను 7382865145 నంబరులో సంప్రదించాలన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన అభ్యర్థులు వృత్తి నిబద్ధతతో ఉత్తమ డ్రైవర్లుగా రాణించగలరని తెలిపారు.

ఫొటో, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్/సర్వీసింగ్‌లో 26వ తేదీ నుంచి నెల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సెంటర్ మేనేజర్ ఎన్.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.అలాగే సీసీ టీవీ, కెమెరా ఇన్‌స్టలేషన్/సర్వీసింగ్‌లో 13 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువకులు శిక్షణకు అర్హులన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9440905478, 9985606866 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నిక్కచ్చిగా టమోటల పంపిణీ చేపట్టాలి



వినియోగదారులకు టమాటాలను పంపిణీ చేస్తున్న డీడీ శ్రీకాంత్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న టమాటాల పంపిణీ కార్యక్రమాన్ని నిక్కచ్చిగా చేపట్టాలని మార్కెటింగ్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ఆదేశించారు. కడప రైతుబజార్‌కు వచ్చిన సబ్సిడీ టమాటాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. కడప రైతు బజార్‌కు రెండు టన్నుల టమాటాలు వచ్చాయని, ఒక్కొక్క వినియోగదారుడికి కిలో చొప్పున అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ అజాద్‌వల్లి, రైతు బజార్ మేనేజర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అదిరేట్టు..ఐదారు రెట్లు

- ఆర్టీసీ ఉద్యోగులకు అధిక పెన్షన్ స్కీమ్
- ప్రభుత్వం అవిశ్రాంత'కానుక
- కడప రీజియన్ వ్యాప్తంగా 2335 మందికి లబ్ధి
- నమోదుకు 11 తుది గడువు



కడపలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ ఉద్యోగుల భద్రతే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తోంది. ఇందులో భాగంగా భారత దేశంలో ఎక్కడా లేని విధంగా ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వోద్యోగులుగా మార్చి వారి జీవితాల్లో వెలుగులను నింపింది. ఈ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. ఆర్టీసీలో పని చేస్తూ ఉద్యోగ విరమణ అనంతరం అరకొరగా పెన్షన్ అందేది. ఆ విధానానికి చరమగీతం పాడి అధిక పెన్షన్ స్కీమ్ (హయ్యర్‌పెన్షన్)కు ప్రభుత్వం నూతన ప్రణాళికను సిద్ధం చేసింది. దీంతో ఆర్టీసీలో పనిచేస్తూ ఉద్యోగి పదవీ విరమణ అనంతరం అధిక మొత్తంలో పెన్షన్‌ను జీవితాంతం అందుకునేందుకు బాటలు వేశారు. ఉద్యోగి పదవీ విరమణ అనంతరం రూ. 3 వేల పెన్షన్ మాత్రమే పొందేవాడు. అయితే ఈ హయ్యర్ పెన్షన్ స్కీమ్ ద్వారా ఇప్పటివరకు అందే పెన్షన్ కన్నా ఐదు లేక ఆరు రెట్ల వరకు పెరిగే అవకాశం ఉంది.

- రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హయ్యర్ పెన్షన్ స్కీమ్ పథకం ద్వారా ఆర్టీసీలో ఉద్యోగ విరమణ చేసిన తర్వాత చిరకాల స్వప్నం త్వరలో నెరవేరనుంది. ఈ స్కీమ్‌లో నమోదయ్యేందుకు ఆన్‌లైన్‌లోనే ఎంప్లాయిస్ పెన్షన్ అండ్ ఆర్గనైజేషన్‌లో వివరాలను అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టారు. 2014 సెప్టెంబరు 1 నాటికి ఆర్టీసీ ఉద్యోగిగా విధుల్లో చేరిన కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజ్‌మెకానిక్‌లు, సెక్యూరిటీ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది ఇందుకు అర్హులు.

మరో అవకాశం

ఈ హయ్యర్ పెన్షన్ స్కీమ్ పథకంలో నమోదుకు మొదట ఏప్రిల్ 3 నుంచి మే 3 వరకు, మే 4 నుంచి జూన్ 26 వరకు నమోదుకు అవకాశం కల్పించారు. అయితే కొద్దిమంది ఉద్యోగులు సాంకేతిక కారణాల వల్ల సరైన వివరాలను నమోదు చేయలేదు. దీంతో కొందరి దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. అందువల్ల మూడో విడత జూన్ 27 నుంచి ఈనెల 11వ తేదీ వరకు నమోదు చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులు పూర్తి స్థాయిలో నమోదు చేసుకున్నాక బేసిక్ స్కేల్‌ను అనుసరించి ఎంప్లాయిస్ పెన్షన్ ఫండ్ ఆర్గనైజేషన్ లెక్కలు కట్టి ఉద్యోగులకు చెల్లించే మొత్తాన్ని ప్రకటించనుంది.



ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సిన వెబ్‌సైట్

ముఖ్యమంత్రికి రుణపడి ఉన్నాం



ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత అరకొర పెన్షన్ వస్తుందని ఆందోళన చెందాం. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అధిక పెన్షన్ పథకం తీసుకు రావడం సంతోషంగా ఉంది.ముఖ్యమంత్రికి రుణపడి ఉన్నాం.

– ఎస్.బాబా ఫక్రుద్దీన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఏపీఎస్ ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్

మరో అద్భుత అవకాశం



జిల్లాలోని ఎనిమిది డిపోల నుంచి 2335 మంది ఉద్యోగులు హయ్యర్ పెన్షన్ పథకానికి అర్హులు. ఈ పథకంలో నమోదుచేసుకునే అవకాశం ఈనెల 11వ తేదీ వరకు ఉంది. సాంకేతిక కారణాలతో వెనుదిరిగిన ఉద్యోగులు నమోదు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. ఈ అవకాశాన్ని ఆర్టీసీ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి.

– గోపాల్‌రెడ్డి, డీపీటీఓ, కడప

ప్రయోజనం పొందనున్న ఉద్యోగుల వివరాలు

డిపో	ఉద్యోగులు
కడప	473
పులివెందుల	434
బద్వేలు	285
జమ్మలమడుగు	283
మైదుకూరు	296
ప్రొద్దుటూరు	534
డీపీటీఓ కార్యాలయ ఉద్యోగులు	30
మొత్తం	2,335

టీచర్స్ సొసైటీ అధ్యక్షుడి నియామకం



శ్యాంసుందర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్‌: కడపజిల్లా ఎలిమెంటరీ, సెకండరీ స్కూల్స్ టీచర్స్ సహకార గృహ నిర్మాణ సంఘం తాత్కాలిక అధ్యక్షుడిగా శ్యాంసుందర్ రెడ్డిని పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకుందని కార్యదర్శి విశ్వనాథరెడ్డి తెలిపారు. గతంలో అధ్యక్షుడిగా పనిచేసిన లక్ష్మీరాజా వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో బుధవారం సొసైటీ కార్యాలయంలో పాలకవర్గం అత్యవసరంగా సమావేశమై శ్యాంసుందర్‌రెడ్డిని తాత్కాలిక అధ్యక్షుడిగా ఎన్నుకుందన్నారు. పూర్తిస్థాయి ఎన్నికలు నిర్వహించేంత వరకు ఈయన కొనసాగుతారని తెలిపారు. కాగా, పాలకవర్గమంతా సమష్టిగా పబ్బాపురం ప్లాట్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పరీక్షా ఫలితాలు విడుదల



పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ఏఎఫ్‌యూ: కడపలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ విభాగాలకు సంబంధించిన రెండో, ఆరో సెమిస్టర్, రెగ్యులర్ పరీక్షా ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. వైస్ చాన్సలర్ ఆచార్య బి.అంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి పరీక్షా ఫలితాలను స్క్రీన్‌పై విడుదల చేశారు. ఫలితాలను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్ రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డా. ఇ.సి. సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. సౌమ్యనాథుని రథోత్సవం



ఆలయ మాఢవీధుల్లో భక్తజన సందోహం మధ్య కదులుతున్న రథం

నందలూరు(రాజంపేట): సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ మాఢవీధుల్లో రథోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని సుందరంగా అలంకరించి రథంపై కొలువు దీర్చారు. వైఖానస ఆగమశాస్త్ర పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల గోవిందా గోవిందా అంటూ రథాన్ని లాగారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజంపేట, నందలూరు పోలీసులు బందోబస్తును నిర్వహించారు.రథోత్సవం ముగింపు సందర్భంగా తూర్పు గాలిగోపురం వద్ద పూజ కార్యక్రమాలను టీటీడీ అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురిని సన్మానించారు. ఎంపీపీ మేడా విజయ భాస్కర్‌రెడ్డి పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ సోదరుడు ఆకేపాటి అనిల్‌రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే సోదరుడు భూమనశంకర్‌రెడ్డి, సినీనటుడు తోట వేణు, ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌రాజు, అర్చకులు సునీల్, సాయి, యశ్వంత్, పవన్ శర్మ, మనోజ్, బోయలు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

ప్రొద్దుటూరు/రాజుపాళెం: ప్రభుత్వం నిర్వహిస్తున్న 'జగనన్న సురక్ష'కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. ప్రొద్దుటూరు మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామ సచివాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు దరఖాస్తు చేసుకున్న సర్టిఫికెట్లను వెంటనే మంజూరు చేస్తున్నామని అన్నారు. బిడ్డ జన్మించిన మూడు నెలల నుంచే ఆధార్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కలెక్టర్ సూచించారు. తాము చదువుకునే రోజులకంటే ప్రభుత్వ పాఠశాలలు ఇప్పుడు పూర్తి మెరుగ్గా ఉన్నాయన్నారు. గతంలో ప్రైవేటు పాఠశాలలకు ముందు పుస్తకాలు వచ్చేవని, ఇప్పుడు ప్రభుత్వ బడులకు వస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత గలిగిన భోజనం పెట్టడంతోపాటు విద్యార్థులకు అన్ని ఉచితంగా ఇస్తున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీలోని 130 మందికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీఓ జి.శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఎంపీడీఓ కుళ్లాయమ్మ, సచివాలయాల మండల కన్వీనర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ సురేష్ రెడ్డి, ఏపీఎం వెంకటసుబ్బమ్మ, సర్పంచ్ మధుసూదన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బండిఆత్మకూరు సుధాకర్‌రెడ్డి, గ్రామస్తుల ఫిర్యాదు మేరకు వెంటనే రోడ్డు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలను తయారు చేయాలని పీఆర్‌డీఈఈ మల్లేశ్వరరెడ్డిని కలెక్టర్ ఆదేశించారు.

- రాజుపాళెం మండలంలోని చిన్నశెట్టిపల్లెలో జరిగిన కార్యక్రమంలో కూడా కలెక్టర్ విజయరామరాజు పాల్గొన్నారు. జగనన్న సురక్ష కింద 11 రకాల పత్రాలను అందిస్తున్నామని చెప్పారు. గ్రామంలో కుటుంబాల సంఖ్య రేషన్ కార్డుల వివరాలను కలెక్టర్ అక్కడున్న అధికారులను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఆనంద్ నాయక్, మండల ప్రత్యేకాధికారి రాఘవేంద్ర కుమార్, ఎంపీటీసీ సభ్యుడు శివనాగిరెడ్డి, సచివాలయ కన్వీనర్ వెలవలి శేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎంబీ శివశంకర్ రెడ్డి, తహసీల్దార్ ఇందిరా రాణి పాల్గొన్నారు.

టీడీపీలో విభేదాలు బట్టబయలు!

- సీఎం సురేష్ ఆధిపత్యంపై ఇన్‌చార్జి ప్రవీణ్ గుస్సా
- యనమల రామకృష్ణుడుకు మొత్తం వ్యవహారంపై ఫిర్యాదు
- బహిరంగ సభకు దూరంగా ఉండిపోయిన ప్రవీణ్, శ్రీనివాసులరెడ్డి



యనమల రామకృష్ణుడుకు పరిస్థితి వివరిస్తున్న శ్రీనివాసులరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: ప్రొద్దుటూరు నియోజకవర్గం టీడీపీలో అంతర్గత విభేదాలు బట్టబయలయ్యాయి. పొట్లదుర్తికి చెందిన సీఎం సురేష్ నాయుడు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవ సందర్భంగా మరోమారు తెరపైకి వచ్చాయి. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీకి చేరువ అయ్యేందుకు జిమ్మిక్కులతో అనూహ్య ఎత్తుగడలు వేస్తున్నారని ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మండిపడుతున్నట్లు సమాచారం. అయిష్టాంగానే ప్రారంభోత్సవానికి హాజరైనా బహిరంగ సభకు దూరంగా ఉండిపోయారు.

బీజేపీ నేత రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ సోదరుడు సీఎం సురేష్ ప్రొద్దుటూరు అసెంబ్లీ టీడీపీ టికెట్‌పై కన్నేశారు. ఈనేపథ్యంలో అన్న క్యాంటీన్ పేరిట వ్యూహాత్మకంగా ఎత్తుగడలు వేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో సహా అనేక మంది నాయకులను ఆహ్వానించారు. కాగా, మండలి విపక్షనేత యనమల రామకృష్ణుడు, మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి మినహా ఇతర ప్రాంతాలకు చెందిన నాయకులెవ్వరూ హాజరు కాలేదు. అందుకు కారణం కూడా టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి.. అతన్ని ప్రోత్సహిస్తున్న పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్ శ్రీనివాసులరెడ్డిలే ప్రధాన కారకులుగా పార్టీ నేతలు చెప్పుకొస్తున్నారు. ఇటీవల పాదయాత్రలో భాగంగా ప్రొద్దుటూరుకు వచ్చిన నారా లోకేశ్ పార్టీ టికెట్ ప్రవీణ్‌కే అని పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. ఈ పరిణామాన్ని అడ్డుకునేందుకు టీడీపీ నేతలు తెరవెనుక మంత్రాంగాలు నిర్వహించి, సీఎం సురేష్‌ను తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది.

పొట్లదుర్తి బ్రదర్స్‌పై ఫిర్యాదు....

టీడీపీ అధికారంలో ఉండగా పొట్లదుర్తి బ్రదర్స్‌కు అగ్రపీఠం దక్కింది. అధికారానికి దూరం కాగానే సీఎం రమేష్ బీజేపీ పంచన చేరారు. పొట్లదుర్తి గ్రామస్థాయి నాయకులకు ఉన్నతస్థాయి పదవులు కట్టబెట్టారు. ఆయన సోదరుడు సీఎం సురేష్ కూడా నాలుగేళ్లుగా పార్టీకి అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రొద్దుటూరులో ఎవ్వరూ లేని సమయంలో పార్టీ కోసం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పనిచేశారు. ఇబ్బందులు పడ్డారు, నారా లోకేష్ సైతం అభ్యర్థిగా ఇండికేషన్ ఇచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో అన్న క్యాంటీన్ అంటూ గ్రూపు రాజకీయాలకు తెరలేపుతున్నారని పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్ శ్రీనివాసులరెడ్డి, ప్రొద్దుటూరు ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు మండలి విపక్షనేత యనమల రామకృష్ణుడికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదే విషయాన్ని రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు కూడా వివరించడంతో ఆయన ఈ కార్యక్రమానికి హాజరు కాలేదని సమాచారం. కాగా యనమలతో మీ పెద్దరికం కోసం ప్రారంభోత్సవానికి హాజరయ్యామని, బహిరంగ సభలో పాల్గొనలేమని తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. ఆమేరకు వారిద్దరు బహిరంగ సభ వేదికపై కన్పించకపోవడం విశేషం.

అన్న క్యాంటీన్ ప్రారంభం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక కొర్రపాడు రోడ్డులోని పీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ నాయకుడు సీఎం సురేష్‌నాయుడు తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్, మొబైల్ క్యాంటీన్‌ను బుధవారం మాజీ ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సీఎం సురేష్ నాయుడు తన సొంత నిధులతో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మూసివేయించారన్నారు. పేదల పక్షాల నిలబడినట్లు జగన్ నటిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గద్దె దిగడం, జగన్ జైలుకు వెళ్లడమూ ఖాయమన్నారు. మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లేల లింగారెడ్డి, సీఎం సురేష్‌నాయుడు, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, ప్రొద్దుటూరు నియోజవకర్గ ఇన్‌చార్జి టీడీపీ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్, ఆసం రఘురామిరెడ్డి, వీఎస్ ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి కడపలో రాష్ట్రస్థాయి 'గైనిక్' సదస్సు



రాష్ట్రస్థాయి 'గైనిక్' సదస్సు బ్రోచర్స్‌ను ఆవిష్కరిస్తున్న గైనిక్ సొసైటీ సభ్యులు

కడప రూరల్: రాష్ట్ర అబ్సటిక్ అండ్ గైనకాలజీ సొసైటీ పర్యవేక్షణలో కడప శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రస్థాయి గైనిక్ సదస్సును కడపలో నిర్వహిస్తున్నట్లు ఆ సొసైటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పద్మలత, వై.ప్రియోదరెడ్డి తెలిపారు. ఐఎంఏ హాల్‌లో సదస్సు బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్త్రీ మరియు గర్భకోశ సంబంధిత వ్యాధులకు సంబంధించి వైద్య రంగంలో పెను మార్పులు సంభవించాయన్నారు. వీటిని పరస్పరం తెలుసుకోవడం, చర్చించడం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. మాధవి కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయిలో పేరుగాంచిన ప్రముఖ గైనకాలజిస్టులు, వక్తలు, అధ్యాపకులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా కడప నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు గ్రేస్ నిర్మల, తులశమ్మ జ్ఞాపకార్థం ప్రత్యేక ఉపన్యాసం ఉంటుందన్నారు. కాగా సదస్సుకు వచ్చే అతిథులకు జిల్లాలోని ప్రముఖ చారిత్రక ప్రదేశాలు, ఆధ్యాత్మిక కేంద్రాలను చూపించడంతో పాటు ఇక్కడి వంటకాల రుచులను అందించనున్నట్లు తెలిపారు. వైద్యులందరూ ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

జువైనల్ జస్టిస్ బోర్డు చైర్మన్, మెంబర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప అర్బన్ : బాలల సంక్షేమం, సంస్కరణల సేవల శాఖ ఆధ్వర్యంలో జువైనల్ జస్టిస్ బోర్డులో (పిల్లల రక్షణ మరియు సంరక్షణ) చైర్‌పర్సన్‌లు, సభ్యులుగా, సోషల్ వర్కర్ మెంబర్లుగా సేవలు అందించేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా మదనపల్లి అదనపు జిల్లా పర్యవేక్షణాధికారి జి. లక్ష్మీపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలను హెచ్‌టీటీపీ://డబ్ల్యూసీడీఎస్‌సీ // డబ్ల్యూసీడీఎస్‌సీ.ఏపీ.ఎన్ఐసీ.ఐఎన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. లేదా 97013 86650 నంబరులో సంప్రదించాలని కోరారు.

'జింకా'కు మొల్ల పురస్కారం

కడప కల్చరల్ : ప్రొద్దుటూరుకు చెందిన సాహితీవేత్త జింకా సుబ్రమణ్యంకు మొల్ల పురస్కారం అందజేశారు. బుధవారం కడప నగరంలోని మొల్ల సాహిత్యపీఠం కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు ఈ మేరకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం, రూ. 5116 నగదు, శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ జింకా సుబ్రమణ్యం మహిళా సాహితీ వేత్తలను ప్రోత్సహిస్తున్నందుకు గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేశామన్నారు. పురస్కార గ్రహీత జింకా సుబ్రమణ్యం స్పందిస్తూ తన సేవలను గుర్తించి మొల్లమాంబ పురస్కారం అందజేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో పీఠం సభ్యులు శేషారెడ్డి, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ దొంగ అరెస్టు

చక్రాయపేట : మండలంలోని గంగారపువాండ్లపల్లె చింతల గంగమ్మ ఆలయంలో హుండీ పగలగొట్టి నగదు కాజేసిన దొంగను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. గత నెల 20న ఆలయంలోని హుండీ పగుల గొట్టి డబ్బు తీసుకెళ్లారని తమకు ఫిర్యాదు అందిందన్నారు. ఈ ఫిర్యాదు మేరకు ఆరా తీసి సత్యసాయి జిల్లా తలుపుల మండలం మామిళ్లవారిపల్లెకు చెందిన ఎల్లూరు కరుణాకరరెడ్డిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ..5250ల నగదు, సెల్‌ఫోన్ మెమోరి కార్డులను స్వాధీనం చేసుకొన్నట్లు ఆయన తెలిపారు. ఈమేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

చక్రాయపేట : మండలంలోని సురభి గ్రామం రెడ్డివారిపల్లె సమీపంలో మూలకుంట చెరువు వద్దగల చీగలగుట్ట వద్ద బుధవారం సాయంత్రం విద్యుదాఘాతంతో సురభి బాబు (28) అనే యువకుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న చక్రాయపేట పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే సంఘటనకు సంబంధించి ఎవరూ ఫిర్యాదు చేయలేదని, వివరాలు ఆరా తీస్తున్నామని ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.



శ్రీనివాసులరెడ్డి హత్య కేసులో మరింత పురోగతి!

- మరో నిందితున్ని పట్టించిన ఫోన్ కాల్స్, గూగుల్ టేకౌట్, వాట్సాప్ చాటింగ్
- పోలీసుల అదుపులో కీలక నిందితుడు సుబ్బారెడ్డి
- విచారణ అనంతరం అరెస్టు చూపే అవకాశం

సాక్షి ప్రతినిధి, కడప : కడప నగరంలో ఇటీవల జరిగిన వైఎస్సార్‌సీపీ నేత సి.శ్రీనివాసులరెడ్డి హత్య కేసులో పోలీసులు మరింత పురోగతి సాధించారు. హత్య ఘటనలో పాల్గొన్న ఆరుగురు ప్రధాన నిందితుల్ని ఇదివరకూ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. కాగా, హత్యా ఘటనలో ప్రత్యక్ష, పరోక్ష సహకారం అందించిన ఏ ఒక్కరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ప్రకటించారు. ఆమేరకు కీలక నిందితుడుగా భావిస్తున్న పాలెంపల్లెకు చెందిన రాజు వెంకటసుబ్బారెడ్డి ప్రమేయం నేపథ్యంలో అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే...

జూన్ 23న ఉదయం కడప నగరం సంధ్యా సర్కిల్ సమీపంలో జిమ్‌కు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాసులరెడ్డిని దారుణంగా హత్య చేశారు. బుర్ఖాలు ధరించి మాటువేసి ఉన్న దుండగులు పక్కా ప్రణాళిక ప్రకారం అంతమొందించారు. ఈ హత్యకు సబంధించిన సీసీ పుటేజీలు వైరల్ అయ్యాయి. హత్యా ఘటన తీరు రాష్ట్రంలో సంచలనమైంది. తక్షణమే స్పందించిన పోలీసులు రెండు రోజుల వ్యవధిలో ఆరుగురు నిందితుల్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆపై మరింత లోతుగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఫోన్ కాల్స్, గూగుల్ టేకౌట్, వాట్సాప్ చాటింగ్ విశ్లేషించారు. ఈ నేపథ్యంలో పాలెంపల్లెకు చెందిన రాజు వెంకటసుబ్బారెడ్డి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. పరారీలో ఉన్న సుబ్బారెడ్డిని పోలీసులు హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకొన్నట్లు సమాచారం.



హత్యకు గురైన శ్రీనివాసులరెడ్డి(ఫైల్)

ఒకప్పటి సన్నిహితులు విడిపోవడంతో..

'శత్రువుకు శత్రువు మిత్రుడే' అన్నట్లుగా సుబ్బారెడ్డి ఈ హత్యలో వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారం పరిశీలిస్తే 2021 వరకూ సుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి కలిసికట్టుగా పలు వ్యవహారాలు నడిపారు. అప్పట్లో వారి మధ్య విభేదాలు తలెత్తిన నేపథ్యంలో ఇరువురు విడిపోయారు. తర్వాత శ్రీనివాసులరెడ్డికి ప్రతాప్‌రెడ్డి, ల్యాబ్ శ్రీను సన్నిహితులయ్యారు. ఈ క్రమంలో శ్రీనివాసులరెడ్డి, ప్రతాప్‌రెడ్డిల మధ్య బంధుత్వం కూడా ఏర్పడింది. కాగా 3నెలల క్రితం శ్రీనివాసులరెడ్డితో ఆర్థిక విభేదాలు రావడంతో ప్రతాప్‌రెడ్డి, ల్యాబ్ శ్రీను కూడా విడిపోయారు. ఇదే అదనుగా తీసుకున్న సుబ్బారెడ్డి ప్రతాప్‌రెడ్డి, ల్యాబ్ శ్రీను ద్వారా శ్రీనివాసులరెడ్డిని హత్య చేయించినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. శ్రీనివాసులరెడ్డి సతీమణి మౌనిక ఫిర్యాదులో సుబ్బారెడ్డి పేరు ఉండడంతో పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేశారు. హత్య తర్వాత కూడా నిందితుల్లో ఒకరు సుబ్బారెడ్డికి ఫోన్ చేసినట్లు సమాచారం. ఫోన్ కాల్స్ విశ్లేషణ, గూగుల్ టేకౌట్, వాట్సాప్ చాటింగ్ ఇవన్నీ పరిశీలించిన పిదప వెంకటసుబ్బారెడ్డిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆమేరకు గురు లేదా శుక్రవారాల్లో అరెస్టు చూపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అంగన్‌వాడీ కేంద్రంలో అగ్ని ప్రమాదం

చక్రాయపేట : మండలంలోని సురభి గ్రామం గాజులపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గ్యాస్ లీకేజీ కారణంగా మంటలు రేగి పలు రికార్డులు కాలి బూడిదయ్యాయని గ్రామస్తులు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం వంట గదిలో ప్రమాదవశాత్తు గ్యాస్ లీక్ కావడంతో ప్రమాదం సంభవించింది. వెంటనే గ్రామస్తులు మంటలను ఆర్పివేశారు. అయితే కేంద్రంలోని చిన్నారులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన స్థలాన్ని వేంపల్లె సీడీపీఓ సునీత, సురభి సెక్టార్ సూపర్‌వైజర్ సుభద్ర పరిశీలించారు.

వెలుగు సీసీ సస్పెన్షన్

కమలాపురం : కమలాపురం మండలంలో వెలుగు సీసీగా పని చేస్తున్న సునీతను డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్ సస్పెండ్ చేసినట్లు వెలుగు ఏరియా కోఆర్డినేటర్ రఘునాథరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వల్లూరు మండలంలో సీసీగా పని చేస్తున్న సమయంలో సునీత అవినీతి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. దాదాపు రూ. 54లక్షల మేరకు అవినీతి జరిగిందని విచారణలో తేలడంతో ఆమెను సస్పెండ్ చేసినట్లు ఆయన తెలిపారు.

రూ.3 లక్షలు విలువ చేసే ఎరువుల అమ్మకాలు నిలిపివేత

గోపవరం : సరైన పత్రాలు లేకపోవడంతో రూ.3 లక్షలు విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలిపివేసినట్లు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ రమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వ్యవసాయాధికారి అరవిందనాయక్‌తో కలిసి ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విత్తనాల మొలక శాతం చూసిన తర్వాతనే రైతులకు విక్రయించాలని తెలిపారు. కొనుగోలు చేసిన రైతులకు బిల్లు అందజేయాలన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎమ్మార్పీ ధర కన్నా ఎక్కువ ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి దుకాణంలోనూ ధరల పట్టిక అందుబాటులో ఉంచాలన్నారు. ఎరువుల కోసం వచ్చిన రైతుల నుంచి వివరాలు సేకరించి ఈ-పాస్ మిషన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ తనిఖీల్లో భాగంగా ఓ దుకాణంలో ఎలాంటి పత్రాలు లేని రూ.3 లక్షలు ఎరువులను తాత్కాలికంగా అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేయడంతో పాటు వారికి ప్రభుత్వ నిబంధనలు తెలియజేయాలన్నారు. అలాగే కాలం చెల్లిన పురుగు మందులను రైతులకు విక్రయించవద్దన్నారు. అనంతరం దుకాణాల్లోని తూకాలు, రిజిస్టర్లు, ఇన్‌వాయిస్‌లను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ రమణారెడ్డి

అనుమానాస్పద స్థితిలో ఆర్టీపీపీ ఉద్యోగి మృతి

- రక్తపుమడుగులో పడి ఉన్న ఉద్యోగి వీర భాస్కర్‌రెడ్డి
- పక్కనే రక్తంతో తడిసిన ఇనుప రాడ్డు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు



వీరభాస్కర్‌రెడ్డి (ఫైల్)

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ)లో స్టేజీ-1లో పనిచేస్తున్న జేపీఏ అమ్మిరెడ్డి వీర భాస్కర్‌రెడ్డి (30) అనే ఉద్యోగి ఆర్టీపీపీలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని జమ్ములమడుగు డీఎస్పీ నాగరాజు, కొండాపురం సీఐ సుదర్శనప్రసాద్, కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డిలు పరిశీలించారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తొండూరు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన వీరభద్రారెడ్డి కుమారుడు వీర భాస్కర్‌రెడ్డి. ఇటీవల సుమారు 7 నెలల క్రితం నెల్లూరు నుంచి ఆర్టీపీపీకి వచ్చిన వారిలో జేపీఏ వీరభాస్కర్‌రెడ్డి ఉన్నాడు. ఇతనికి రెండు నెలల క్రితం దువ్వూరు మండలం బాలాయపల్లి గ్రామానికి చెందిన సుప్రియతో వివాహమైంది. రోజు మాదిరిగానే బుధవారం డ్యూటీకి వచ్చాడు. డ్యూటీలో ఉండగానే తలకు బలమైన గాయంతో రక్తపుమడుగులో పడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పక్కనే రక్తంతో తడిసిన ఇనుప రాడ్డు కూడా ఉంది. దీన్నిబట్టి ఎవరైనా రాడ్డుతో కొట్టి చంపారా.. లేక మరేదైనా జరిగిందా అనే అనుమానలు వ్యక్తమవుతున్నాయి. విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేశారు. సంఘటన స్థలాన్ని ఆర్టీపీపీ అధికారులతో కలసి పరిశీలించారు. సంఘటన స్థలాన్ని డాగ్ స్క్వాడ్ కూడా పరిశీలించింది. ఈ విషయంపై కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డిని వివరణ కోరగా ఇప్పటి వరకూ అనుమానాస్పదంగా ఉందన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని తెలిపారు.



రక్తపు మడుగులో పడిఉన్న వీరభాస్కర్‌రెడ్డి మృతదేహం

జాతీయ విద్యావిధానంతో విప్లవాత్మక మార్పులు

వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : పాఠశాల విద్య నుంచి ఉన్నతవిద్య వరకు విప్లవాత్మక మార్పులకు జాతీయ విద్యావిధానం తోడ్పడుతుందని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. బుధవారం వైవీయూలో ఏపీ ఉన్నత విద్యామండలి విద్య ద్వారా సమాజ అభివృద్ధి బోర్డు (బి.సి.డి.ఈ) ఆధ్వర్యంలో సర్వశిక్ష అభియాన్, యునెసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో 'భాష అభివృద్ధి' (లాంగ్వేజ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం)పై ఒక్కరోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అభ్యాసకుడికి పఠనం, మననం, చింతనం, సంకీర్తనం అవసరమన్నారు. మంచి విద్యార్థి అంటే ఉత్తమ అభ్యాసకుడన్నారు. బాలబాలికల అభ్యసన సాధనకు ఉన్నతవిద్యను అభ్యసించే విద్యార్థుల సేవలను వినియోగించుకోవాలన్న ఆలోచన ఎంతో గొప్పదన్నారు. ఇదే సందర్భంలో యువతకు సమాజాభివృద్ధిపై బాధ్యత పెరుగుతుందన్నారు. విద్య పరివర్తనదిశగా అడుగులేస్తోందన్నారు. జాతీయ విద్యావిధానం ద్వారా భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందన్నారు. విద్యార్థి నిత్య అభ్యాసకుడిగా ఉన్నప్పుడు జ్ఞానసముపార్జన సాధ్యమవుతుందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విద్యలో సుస్థిర అభివృద్ధిని సాధించేందుకు, దేశంలోనే రాష్ట్రం ఉన్నత ర్యాంకును సాధించేందుకు ఈ విధానం దోహదం చేస్తుందన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్య బలోపేతానికి ఉన్నతవిద్య సహకారం ప్రయోజనకరమన్నారు. బీసీడీఈ సీఈఓ, కార్యదర్శి ఆచార్య ఎం.ఎల్.ఎస్. దేవకుమార్ మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులు పాఠశాలల్లోని పిల్లల విద్యాప్రమాణాలు పెంచే క్రతువులో భాగస్వామ్యం కావడం వల్ల యునెసెఫ్ నుంచి సర్టిఫికెట్ లభిస్తుందన్నారు. సీడీసీ డీన్ ఆచార్య వై. సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు కింద పాఠశాలల్లో పనిచేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఓరియంటేషన్ సమన్వయకర్త సంపత్‌కుమార్, అప్పారావు, వివిధ కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

విజిలెన్స్ దాడులు

– 352 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

బద్వేలు అర్బన్ : పట్టణంలోని రూపరాంపేట సమీపంలోని ఓ గోడౌన్‌పై బుధవారం కడప విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి 352 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ టి.రెడ్డెప్ప తెలిపిన వివరాల మేరకు ... రూపరాంపేట సమీపంలోని ఓ గోడౌన్‌లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారని జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసూమ్‌బాషాకు సమాచారం అందింది. ఈ మేరకు సివిల్ సప్‌లెస్, రెవెన్యూ అధికారులతో కలిసి దాడులు నిర్వహించగా 16 టన్నుల రేషన్ బియ్యం లభించాయన్నారు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన శివ, సురేంద్ర, వెంకటసుబ్బయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు రూ.6.57 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఏఈ అశోక్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ చంద్రశేఖర్, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.



ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

పెద్దముడియం : మండలంలోని ఉలవపల్లె గ్రామం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఏఎస్ఐ లక్ష్మిరెడ్డి తెలిపారు.చౌడూరు గ్రామం నుంచి కర్నూలు జిల్లా చాగలమర్రి ప్రాంతానికి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా సిబ్బందితో కలిసి దాడి చేశారు. పట్టుకున్న ట్రాక్టర్లను ఎస్ఈబీ ఎస్ఐకి అప్పగించినట్లు తెలిపారు.

శిక్షణతో ఉపాధ్యాయులకు ప్రయోజనం

– టీచర్ల శిక్షణా కేంద్రాన్ని సందర్శించిన ఏపీ స్టేట్ సీఎస్‌సీ ఐటీ సెల్ అబ్జర్వర్ రెహమాన్



శిక్షణ కేంద్రంలో ఐటీ సెల్ అబ్జర్వర్ రెహమాన్, ఇతర అధికారులు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందిస్తున్న ట్రెయినింగ్ ఆన్ టీఎఫ్‌టీ ప్యానెల్‌తో ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీఎస్‌సీ ఐటీ సెల్ అబ్జర్వర్ రెహమాన్ అన్నారు. కడప నగర శివార్లలోని కేఎస్‌ఆర్‌ఎం, అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల, చాపాడులోని సీబీఐటీలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల అధ్యాపకుల ద్వారా ఉపాధ్యాయులకు అందిస్తున్న శిక్షణతో సాంకేతికంగా సులభతరమైన బోధన, అభ్యాసన వంటి అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు నారాయణ, ధనలక్ష్మి, లియస్‌ఖాన్, రమణమూర్తి, ఇమామ్‌ఖాన్, కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్‌ఎస్‌మూర్తి, సాంకేతిక నిపుణులు డాక్టర్ వెంకటరమణ, సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరులో జిల్లా వాసిమృతి

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని ఓ లాడ్జిలో భానుప్రకాష్ (48) అనే వ్యక్తి మృతి చెందాడు. వైఎస్సార్ జిల్లా దేవచెరువుకు చెందిన భానుప్రకాష్ బెంగళూరులోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. పుత్తూరులో ఇతనికి తెలిసినవాళ్లు ఉండటంతో సోమవారం చిత్తూరు నగరానికి వచ్చి ఓ లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నాడు. మంగళవారం రాత్రి గుండెలో నొప్పి ఉందని చెప్పడంతో.. లాడ్జి సిబ్బంది అతన్ని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన భానుప్రకాష్

అశ్వవాహనంపై సౌమ్యనాథుడు

నందలూరు(రాజంపేట) : సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి సౌమ్యనాథస్వామి అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.